క్లుప్తంగా

సజ్జలతో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ



సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన గాలాయగూడెం వైఎస్సార్‌సీపీ నేతలు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం తాడేపల్లి రాష్ట్ర కార్యాలయంలో గాలాయగూడెం పార్టీ నేతలు నార్లపాటి మల్లి, కొండపల్లి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ఎన్నికల అనంతరం ఏర్పడిన పరిస్థితులు వివరించారు. పార్టీ అభివృద్ధికి మరింత సమన్వయంతో కృషి చేయాలని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారని నాయకులు వివరించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత



వ్యాయామ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థినులు ప్రసన్న, దమయంతి విద్యకు అవసరమైన ఏడాది ఫీజు చెల్లించేందుకు మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు ముందుకువచ్చారు. దీనికి సంబంధించి రూ.50 వేల నగదును ఆయన సోమవారం సోమవారం గోపన్నపాలెం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్తనియేలు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పేదరికం కారణంగా విద్యార్థుల చదువులు ఆగిపోరాదన్న కారణంతో ప్రిన్సిపల్ సూచన మేరకు ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు దాత కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమలకు పయనమైన అయ్యప్ప మాలధారులు



శబరిమలకు బయలుదేరిన స్వాములు

దెందులూరు: స్వామియే శరణమయ్యప్ప అంటూ 45 రోజులుగా దీక్ష చేపట్టిన అయ్యప్ప మాల దీక్షాధారులు కొవ్వలికి చెందిన గురుస్వామి గుళ్లపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం శబరిమల కొండకు బయలుదేరి వెళ్లారు. ముందుగా వారు కొవ్వలిలోని గ్రామదేవత గంగానమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు గురుస్వామి ఇరుముడులు కట్టి అనంతరం శబరిమలకు బయలుదేరారు.

అన్నదానానికి కందిపప్పు వితరణ



దీపక్ నెక్స్‌జన్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న అన్నదాన సమాజం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పది మందికీ అన్నదానం చేసే శక్తి, ఆసక్తి కలగడం పూర్వజన్మ సుకృతమని అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం అధ్యక్షుడు కొట్టు మధువెంకటరావు అన్నారు. స్థానిక రామకోటి ప్రాంగణంలో ఈ నెల 8న ప్రారంభమైన మాలధారులకు అన్నదాన కార్యక్రమం డిసెంబర్ 23 వరకూ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి దీపక్ నెక్స్‌జన్ సంస్థ తరఫున రూ.2 లక్షల విలువ చేసే కందిపప్పును ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం రామకోటి ప్రాంగణంలో దాత సుబ్రహ్మణ్యంను అన్నదాన సమాజం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

22వ తేదీ వరకు ఆధార్ మొబైల్ శిబిరాలు

భీమడోలు: భీమడోలు మండలంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్న ఆధార్ మొబైల్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి భీమడోలులో సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజులు పాటు ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణ చేయించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 19, 20వ తేదీల్లో గుండుగొలను, పూళ్ల, భీమడోలు సచివాలయాల వద్ద, ఈనెల 21, 22వ తేదీల్లో ఆగడాలలంక, కురెళ్లగూడెం, పోలసానిపల్లి సచివాలయాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

ధాన్యం విక్రయించేందుకూ తప్పని అవస్థ!

- జగన్ హయాంలో అన్నదాతలకు అండగా రైతు భరోసా
- కూటమి ప్రభుత్వం పాలనలో వ్యవసాయ రంగంపై చిన్నచూపు



చేబ్రోలు ఆయకట్టులో రోడ్ల వెంబడి ఉన్న ధాన్యం బస్తాలు



తల్లాపురం రహదారిలో ధాన్యం ఆరబెట్టిన దృశ్యం

ఉంగుటూరు: వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం నుంచి తగిన తోడ్పాటు లభించకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగుకు అండగా నిలిచిందని రైతులు అంటున్నారు. గతంలో ఏటా పెట్టుబడి సాయం, రైతు భరోసా అందించి పంటల సాగుకు సాయం అందేది. ప్రస్తుతం కేంద్రం సాయం రూ.4 వేలు మంజూరు చేసినా సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద అందించాల్సిన సాయాన్ని రైతుల ఖాతాలకు జమ చేయలేదు. దాంతో రైతులు కూటమి ప్రభుత్వంపై పెదవి విరుస్తున్నారు.

రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం

ప్రస్తుతం ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ విధించిన ఆంక్షలను అధికమించేందుకు రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. 17 శాతం తేమ శాతం తీసుకురావడానికి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ రోడ్లు వెంబడి, పుంత రహదార్లు, లింకు రహదారుల్లో రైతులు అవస్థలు పడుతున్నారు. ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, రోజుకోరకంగా మారుతున్న వాతావరణం రైతులు, కౌలు రైతులు సహనాన్ని పరీక్షిస్తోంది. మరో వైపు సార్వా ధాన్యం సకాలంలో విక్రయించుకోలేక, దాళ్వా సాగుకు పెట్టుబడి లేక రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు అడిగిన ధరకు ధాన్యాన్ని విక్రయించి అన్నదాతలు నష్టపోతున్నారు.రాబోయే దాళ్వా సాగులో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చనే ఆలోచనలో కౌలు రైతులు ధాన్యాన్ని కళ్లాల వద్దే ప్రైవేటు వ్యాపారులకు అయినకాడికి విక్రయిస్తున్నారు. 1,725 రూపాయలకు 75 కేజీలు ధాన్యం బస్తాకు ప్రభుత్వం అందిస్తుంటే, ప్రవేటు వ్యాపారులు తేమ శాతం సాకు చూపి, తక్షణం సొమ్ము అందిస్తామంటూ రూ.1,400 నుంచి రూ.1,500 ధానాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో వరి దాదాపు చివరి దశకు వచ్చాయి.

ధాన్యం ఉత్పత్తిలో ఉంగుటూరు మండలం అగ్రస్థానం

ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం ధాన్యం ఉత్పత్తుల్లో ప్రథమ స్థానంలో ఉంది. ఉంగుటూరు మండలంలో 23,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సార్వా సీజన్‌లో 87 వేల టన్నుల ధాన్యం ఎగుమతి అవుతుంది. అయితే ఇప్పటి వరకు 5,200 టన్నులు మాత్రమే ఎగుమతి అయ్యింది. 1,500 టన్నుల ధాన్యం ప్రైవేటు వ్యాపారులు ఇప్పటి వరకు కొనుగోలు చేశారు. ఈలోపు వాతావరణం దోబూచులాట కారణంగా రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. ధాన్యాన్ని రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆరబెట్టుకుని రైతులు కాపలా ఉంటూ చీకటి పడిన వెంటనే రాసులుగా పోసి వాటిపై టార్పాలిన్లు, బరకాలు కప్పడం నిత్యకృత్యమైంది.

మూడు సార్లు ప్రకృతి కన్నెర్ర

సార్వా పంట కాలంలో మూడుసార్లు కురిసిన అధిక వర్షాలకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. సాగు ప్రారంభ దశలో వేసిన నాట్లు అధిక వర్షాలకు తుడిచిపెట్టుకుపోయాయి. ముఖ్యంగా పాలు పోసుకునే దశలో కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో పంట పొలాల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉంది. దీంతో పంట దిగుబడి తగ్గుతుందనే ఆందోళనలో కొందరు రైతులు ఉన్నారు. సరైన కళ్లాలు లేక ఆరబెట్టుకోవడానికి ధాన్యాన్ని ట్రాక్టర్లపై ఖాళీ స్థలాల వద్దకు తరలించాల్సి వస్తోందని రైతులు అన్నారు.

పెట్టుబడి సాయం ఊసే లేదు

కూటమి ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం ఊసేలేదు. ఏటా జగన్ ప్రభుత్వం సకాలంలోనే రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం అందించేవారు. పిల్లల చదువులకు అమ్మఒడి అందించలేదు. పేద కౌలు రైతు కుటుంబాలకు ఈ రెండు పథకాలు అండగా ఉండేవి. చంద్రబాబు పాలనలో ఇంకా పేదలకు, రైతులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. పండిన ధాన్యం మార్కెట్‌కు వెళ్లకపోవడంతో అవస్థలు పడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– నెరుసు రంగరావు, రైతు, చేబ్రోలు

తేమ శాతం నిబంధనతో ఇబ్బందులు

ప్రభుత్వం విధించిన నిబంధన మేరకు ధాన్యానికి 17 తేమశాతం తీసుకురావడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఓవైపు రోజూ కారుమబ్బులు కమ్ముకుంటూ చినుకులు పడతాయోమనన్న భయం వెంటాడుతోంది. దాంతో కంటిమీద కునుకులేకుండా ఉదయం లేచింది మొదలు పొలాల్లోనే ఉంటూ ధాన్యం ఆరబెట్టుకుంటున్నాం.

– గొరిపర్తి దుర్గారావు, చేబ్రోలు, తల్లాపురం

రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్‌ను రద్దు చేయాలని మాల సంఘాల జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై కమిషన్‌ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. సోమవారం గణపవరం మండలం పిప్పరలో నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని 338 ఆర్టికల్ ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నందున వేరే కమిషన్ నియమించడం చెల్లదన్నారు. డిసెంబర్ 6న వైజాగ్‌లో నిర్వహించనున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.జయపాల్, జయకుమార్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: చేపల చెరువులకు మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు గ్రామం వైపునకు వ్యానులో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు. చేపల చెరువుల యజమానిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై తెలిపారు.

జీతాలు పెంచాలని లిక్కర్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



వంగూరు లిక్కర్ ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా చేస్తున్న కార్మికులు

పెదవేగి : జీతాలు పెంచే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వంగూరు లిక్కర్ ఫ్యాక్టరీ కార్మికులు అన్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి జీతాలు పెంచాల్సి ఉందని ఇప్పటి వరకూ దీనిపై ఎటువంటి ప్రకటన విడుదల కాలేదని వారన్నారు. పెదవేగి మండలం వంగూరులోని గౌతమి ఆగ్రో ప్రాడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ లిక్కర్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ కార్మికులు ధర్నా నిర్వహించారు. నిర్లక్ష్యం విడనాడి కనీస వేతనాల ప్రకారం జీతాలు పెంచాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి యూనియన్ ప్రెసిడెంట్ బెజవాడ పద్మ అధ్యక్షత వహించారు.ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల శ్రమను గుర్తించి జీతాలు పెంచాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధి నాగేశ్వరావు మాట్లాడుతూ జీతాలు పెంపుదలపై హైదరాబాదులోని ప్రధాన కార్యాయాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ధర్నాను విరమించి కార్మికులు విధులకు హాజరయ్యారు. కార్యక్రమానికి మరడాని రంగమ్మ, అలీసమ్మ, మోతి భవాని, తోటరాణి, కృప, అనసూయమ్మ, జి. రాణి, లిల్లీ పుష్ప, వి. సావిత్రమ్మ, సుజాత నాయకత్వం వహించారు.

విభిన్న ప్రతిభావంతులకు రక్షణ కల్పించాలి

పెదవేగి : ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ప్రత్యేక రక్షణ ప్రభుత్వ బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ అన్నారు. పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లోని డీసెల్స్ విభిన్న ప్రతిభావంతుల (మూగ, చెవుడు) పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ ప్రత్యేక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా పరిధిలోని వివిధ విభిన్న ప్రతిభావంతుల స్కూల్స్, హాస్టళ్లలో వైద్య శిబిరాలను నిర్వహించాలని, ఆయా సంస్థల్లో వారికి అందుతున్న వసతులపై తరచుగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ పాఠశాలలో చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులను గుర్తించి అవసరమైన వారికి మందులను సరఫరా చేసినట్టు రత్న ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, డాక్టర్ జాన్సరాయ్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ఉంగుటూరు: భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రోజంతా ఉపవాసం ఉండి కేదారీశుని నోములు నోచారు. ఆలయాల్లో రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ఉంగుటూరు, నారాయణపురం, రాచూరు, కంసాలిగుంట, కై కరం, బాదంపూడి నాచుగుంట, చింతాయిగూడెం, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యర్రమిల్లిపాడు రామాలయం వద్ద సోమవారం సహస్ర దీపోత్సవం నిర్వహించారు.

నారాయణపురంలో రోడ్డు ఆక్రమణల తొలగింపు



నారాయణపురం సెంటర్లో గణపవరం రహదారి వైపు రోడ్డు ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం



ఆక్రమణలు తొలగించిన అనంతరం విశాలంగా కనిపిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఎట్టకేలకు రోడ్డు ఆక్రమణలు తొలగించారు. నారాయణపురం –గణపవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో వంతెన సెంటరు నుంచి గణపవరం రహదారిలో సొసైటీ భవనం దాటేంత వరకు రోడ్డు కిరువైపులా పలు నిర్మాణాలున్నాయి. ఆర్‌అండ్‌బీ రహదారి కిరువైపులా ఉన్న ఆక్రమణలును అధికారులు సోమవారం తొలగించారు. ఆక్రమణదారులకు ముందుగానే నారాయణపురం పంచాయతీ కార్యదర్శి విజయ నోటీసులు జారీ చేసి ఆరు రోజులు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో నలుగురు తమ ఇళ్ల వద్ద ఆక్రమణల తొలగింపునకు కొంత సమయం కావాలని కోరడంతో అధికారులు అంగీకరించారు. ఎంతోకాలంగా రోడ్డు ప్రమాదాలకు, ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న ఆక్రమణలపై ఎన్నో విమర్శలు ఉన్నాయి. దీనిపై అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించారు. 40శాతం మంది ముందుగానే స్వచ్ఛందం ఆక్రమణలు తొలగించారు. మిగిలిన 60శాతం మంది ఆక్రమణలను సోమవారం తొలగించారు. పోలీసు, రెవెన్యూ,ఫైర్, ఆర్‌అండ్‌బీ ఇతర శాఖలకు చెందిన సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఉంగుటూరు ఎంపీడీవో రాజ్ మనోజ్, తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు, నిడమర్రు సీఐ సుభాష్, చేబ్రోలు ఎస్సై మామిడాల సూర్యభగవాన్, నిడమర్రు ఎస్సై ప్రసాదు, గణపవరం ఎస్సై మణికుమార్ పెద్ద ఎత్తున పోలీసులు వచ్చారు. సుమారు 66 ఆక్రమణలను తొలగించడంతో రహదారి విశాలంగా కనిపిస్తోంది.

డాగురే సేవలు చిరస్మరణీయం



భీమడోలులో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు

భీమడోలు: కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే ఫొటోగ్రఫీలో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారని ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం భీమడోలు సర్కిల్ అధ్యక్షుడు ద్రాక్షారపు విశ్వనాథం అన్నారు. భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్విస్ మండే డాగురే జయంతిని ఘనంగా నిర్వహించారు. భీమడోలు సంత మార్కెట్ వద్ద గల ఏపీజే అబ్దుల్ కలాం, డాగురే విగ్రహాలకు వారు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ డాగురే ఆవిష్కరణల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఫొటోగ్రాఫర్లు ఉపాధి పొందుతున్నారన్నారు. అనంతరం భీమడోలు స్కూల్ అసిస్టెంట్ ఆహ్మద్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.పరమానందం, పోలసానిపల్లి గురుకుల పాఠశాల టీచర్లు హేమలత, శ్యామలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అఖిల్‌వర్మ



అఖిల్‌వర్మతో పీడీ పద్మావతి

గణపవరం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం తూర్పుగోదావరి జిల్లా వాడపల్లిలో నిర్వహించిన అండర్– 14 డబుల్స్ బీచ్ వాలీబాల్ పోటీల్లో గణపవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థి ఎం.అఖిల్‌వర్మ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ పద్మావతి తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో బాపట్ల జిల్లా మూలాయపాలెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో అఖిల్‌వర్మ పాల్గొంటాడని తెలిపారు. ఈఏడాది ఇప్పటివరకూ అఖిల్‌వర్మ మూడు పర్యాయాలు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్నట్టు తెలిపారు. అఖిల్‌వర్మను, శిక్షణ ఇచ్చిన పీడీ పద్మావతిని హెచ్‌ఎం మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ నిర్మలకుమారి ఉపాధ్యాయులు అభినందించారు.

పుస్తక పఠనంతో జ్ఞానాభివృద్ధి



భీమడోలు శాఖా గ్రంథాలయంలో చదరంగం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి



పిప్పర గ్రంథాలయం వద్ద ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమడోలు: పుస్తక విజ్ఞానం ద్వారా విజ్ఞానాభివృద్ధి జరిగి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల ఉమామహేశ్వరరావు, డైమండ్ లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధి పోలిశెట్టి సత్యనారాయణ గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు.అనంతరం కళాశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో పౌరుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, చదరంగం, క్విజ్ పోటీలు నిర్వహించారు. టీచర్లు సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

పూళ్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల పీడీ కె.వెంకటేశ్వరరావు, వానపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళులు

దెందులూరు: జాతిపిత మహాత్మా గాంధీ గతంలో పోతునూరులోని గ్రంథాలయాన్ని సందర్శించారని ఇది ఎంతో గర్వకారణమని గ్రంథాలయ అధికారి రాంబాబు అన్నారు. సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ వలితో కలిసి పోతునూరు గ్రంథాలయంలో పలువురు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారోత్సవాల సందర్భంగా దెందులూరు, పోతునూరు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు జి. రాంబాబు, ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు ఎం. కృష్ణారావు పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం

గణపవరం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం కలుగుతుందని, చిన్నతనం నుంచే క్రీడల్లో పాల్గొనడం మంచి అలవాటని పలువురు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్యారమ్స్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది గుడ్ల వెంకట కృష్ణారావు, ప్రముఖ చిత్రకారుడు రాజు బత్తుల పర్యవేక్షించారు. గ్రంథపాలకుడు రంగారావు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో ఆటల పోటీలు

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల–1, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పరుగు పోటీ, వాలీబాల్, కబడ్డీ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయం రీడర్స్ ఫోరమ్ సీనియర్ సభ్యుడు కాళ్ల సోమశేఖర్, ఎంఎల్‌వీ నారాయణ, టీచర్లు పాల్గొన్నారు.గ్రంథాలయ పాలకుడు గంగాధర్ పర్యవేక్షించారు.